ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 209 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 5 నవంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

'హర్మూజ్'లో భారత నౌకలకు బిగ్ రిలీఫ్

భారత నౌకలకు ఇరాన్ సడలింపు

న్యూఢిల్లీ, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై విధించిన ఆంక్షల నుంచి భారత్ సహా నాలుగు దేశాలకు ఇరాన్ సడలింపు ఇచ్చింది. భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేసేందుకు భారత నౌకలకు ఈ మినహాయింపు ఇస్తున్నట్లుగా ఇరాన్ పార్లమెంట్ కమిటీ వైస్ ఛైర్మన్ అహ్మద్ హయత్-మొగద్దమ్ వెల్లడించారు.

ఆ నాలుగు దేశాలకు మినహాయింపు..

హర్మూజ్ జలసంధిలో ఎదురవుతున్న భద్రతా ముప్పుల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, చైనా,



ఇరాక్, ఖతార్ దేశాలకు చెందిన నౌకలకు ఈ జలసంధి గుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, తమ దేశానికి అత్యవసరమైన ఔషధాలను భారత్ నుంచి దిగుమతి చేసుకోవడం సులభతరం చేసేందుకే భారత నౌకలకు అనుమతి ఇచ్చినట్లుగా ఇరాన్ స్పష్టం చేసింది.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం అనుమతి

2006 నాటి లంచం ఆరోపణలపై దర్యాప్తు.. రూ.2 కోట్లు డిమాండ్ చేశారని కాంట్రాక్టర్ సాజన్ ఫిర్యాదు



న్యూఢిల్లీ, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు.

మలేసియాకు ..మిగతా 2లో

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

నిర్వహణకు రూ.5 కోట్లు: సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన!

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ వేడుకలు

సదర్ సమ్మేళనానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం సదర్ వేడుకలతో సందడిగా మారింది. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకృష్ణ సదర్ సమితి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌లు హాజరై సదర్ ఉత్సవాల ప్రత్యేకత, సంస్కృతి గొప్పతనం గురించి మాట్లాడారు.

ఇది ఓ అద్భుతమైన కార్యక్రమం

రాష్ట్ర ప్రజలందరికి రేవంత్ రెడ్డి సదర్ శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. సదర్ సంబురాల ద్వారా యాదవులు పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు.

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవమని, ఇది ఓ అద్భుతమైన కార్యక్రమమని సీఎం కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగలాగా జరుపుతున్నామని, తమ ప్రభుత్వం వచ్చాక యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో అన్నీ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ..మిగతా 2లో



ఇందిరమ్మ ఇళ్లలో

దీపావళి సందడి

2.21 లక్షల కుటుంబాలతో రేవంత్ సర్కార్ పండుగ

హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా గృహప్రవేశాలు పూర్తయిన ఇళ్లకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు వెళ్లి కుటుంబాలతో పండుగ జరుపుకోనున్నారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా పలు నగరాల్లో జీ+5 విధానంలో ఇందిరమ్మ టవర్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో ఈసారి దీపావళి వేడుకలు ప్రత్యేకంగా జరగనున్నాయి. పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ' మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి ' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొని లబ్ధిదారుల ఆనందంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ పేదలకు సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కొనసాగిస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు.



ట్విట్టర్ టిల్లు
మీది మేనేజ్‌మెంట్ కోటా.. మాది మెరిట్ కోటా..!

కేటీఆర్ 'బౌన్సర్' కామెంట్స్‌కు బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన 'బౌన్సర్' వ్యాఖ్యలపై సంజయ్ నిప్పులు చెరిగారు. కేటీఆర్‌ను "ట్విట్టర్ టిల్లు" అంటూ ఎద్దేవా చేసిన ఆయన.. "మీది తండ్రి పేరు చెప్పుకుని వచ్చిన మేనేజ్‌మెంట్ కోటా అయితే.. మేం ప్రజల కోసం లాఠీదెబ్బలు తిని ఎదిగిన మెరిట్ కోటా" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

అమిత్ షా పర్యటన.. క్రెడ్ కంట్రోల్‌పై రాద్ధాంతమా?

హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న పాదయాత్రకు కార్యకర్తలు, జనం భారీగా పోటెత్తారని బండి సంజయ్ గుర్తుచేశారు. ఆ సమయంలో తోపులాట జరగకుండా తమ పార్టీ శ్రేణులను, జనాన్ని కంట్రోల్ చేయడానికి ..మిగతా 2లో

హైదరాబాద్‌లో నీటి కష్టాలు..

వాటర్ ట్యాంకర్ల బంద్‌తో హాస్టళ్లు ఖాళీ.. అపార్ట్‌మెంట్లలోనూ సరఫరా నిలిపివేత!

హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని



గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో ..మిగతా 2లో

నేడు తెలంగాణ కేబినెట్ భేటీ.. కీలక నిర్ణయాలపై ఉత్కంఠ



హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. అంతకుముందు మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి మంత్రులతో అనధికారికంగా సమావేశమై పలు అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రభుత్వ ప్రాధాన్యతలు, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. మంత్రివర్గ సమావేశం నేపథ్యంలో ..మిగతా 2లో

తెలంగాణలో
14 ఎంపీ సీట్లు గెలిచి తీరుతాం

రాహుల్‌ను ప్రధానిని చేస్తాం

హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిచి తీరుతాం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసి తీరుతామని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ధీమా వ్యక్తం



చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఛాలెంజ్‌గా తీసుకుంటామన్నారు. బుధవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు.రాహుల్ గాంధీ ఇంట్లోనే ప్రధాని పదవి పుట్టింది. ఆయన ప్రధాని కావాలనుకుంటే 2004లోనే అయ్యేవారు. రాముడి పేరు చెప్పుకుని మూడుసార్లు ప్రధాని ..మిగతా 2లో

సీఎంఆర్ ధాన్యం లెక్కలపై అంతులేని సందేహాలు!





ధాన్యం ఎంత.. బియ్యం ఎంత?

సీఎంఆర్ పేరిట అక్రమ దందా మిల్లర్ల మాయ

విజిలెన్స్ తనిఖీలతో మళ్లీ తెరపైకి వ్యవహారం

దాడులు చేసినా వివరాలు వెల్లడించని వైనం

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

జోగుళాంబ గద్వాల జిల్లాలో రైసు మిల్లులు అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారాయి. తక్కువ సమయంలో ఆర్థికంగా అందలమెక్కాలంటే రైస్ మిల్లుల ఏర్పాటే సరైన మార్గంగా కొందరు భావిస్తున్నారు. దీం తో విచ్చలవిడిగా మిల్లులు ఏర్పాటవుతున్నాయి. తర్వాత తమ పలుకుబడిని ఉ పయోగించి అందినకాడికి దండుకోవడమే పనిగా వారు వ్యవహరిస్తున్నా రు. ప్రభుత్వం మిల్లులకు సరఫరా చేసిన సీఎంఆర్ ధాన్యాన్ని స్వాహా చేయడమే వారు పనిగా పెట్టుకొని కోట్లాది రూపాయలను జేబుల్లో వేసుకుంటున్నారు. జిల్లాలో సీఎంఆర్ పేరిట కొందరు మిల్లర్లు అక్రమ దందాకు పాల్పడుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చి మర ఆడించి ఇవ్వాలని ఇస్తే ప్రభుత్వానికి బియ్యం ఇవ్వడంలో మిల్లర్లు జాప్యం చేస్తున్నా ఎవరూ అడిగే దిక్కు లేదు. దీంతో కొందరి సివిల్ సప్లయ్ అధికారుల సహాయంతో కోట్ల విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లు బయటకు అమ్ముకొని ప్రభుత్వానికి అందాల్సిన బియ్యాన్ని ఎగ్గొడుతున్నారు. అధికారులు ఒత్తిడి చేసిన సమయంలో డీలర్ల వద్ద పీడీఎస్ బియ్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేసి దానిని రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి ఇస్తున్నారు.విజిలెన్స్ సోదాలతో వెలుగులోకి వస్తున్న అక్రమాలు: జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేస్తున్న కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. ఇటీవల అధికారులు తనిఖీల ఏకధాటిగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు బయటపడిన ధాన్యం అక్రమాల విలువ రూ.100 కోట్లు దాటినట్లు సమాచారం. ఇందులో ఒక్క మంగళవారం రోజే ఉండవల్లి, మల్దకల్, గద్వాల మండలంలోని పలు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.30 కోట్ల అక్రమాల్ని గుర్తించారు. విజిలెన్స్ అధికారులు రోజుకు జిల్లాల్లోని పలు మిల్లులపై దృష్టి సారిస్తున్నారు.

ధాన్యం ప్రభుత్వానిది.. లాభాలు ఎవరికో?

కస్టమ్ మిల్లింగ్ రైస్ విధానం ప్రకారం ప్రభుత్వం మిల్లర్లకు ధాన్యం కేటాయిస్తుంది. మిల్లింగ్ అనంతరం నిబంధనల మేరకు బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలి. కానీ ఈ వ్యవస్థలోనే అక్రమాలకు ఆస్కారం ఏర్పడిందా? ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి, బహిరంగ మార్కెట్లో విక్రయించారన్న ఆరోపణల్లో నిజమెంత? నాణ్యత, పరిమాణం, నిల్వలు, సరఫరాల విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వ ధాన్యాన్ని వ్యాపారానికి వినియోగించుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో, ధాన్యం కేటాయింపుల నుంచి బియ్యం అప్పగింత వరకు ప్రతి దశనూ క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉ ంది. కేవలం రికార్డులు చూసి చేతులు దులుపుకుంటే సరిపోదు. గోదాముల్లో ఉన్న నిల్వలు, మిల్లింగ్ వివరాలు, రవాణా రికార్డులు, ప్రభుత్వానికి చేరిన బియ్యం పరిమాణాన్ని సరిపోల్చితేనే అసలు లెక్క తేలుతుంది.

విజిలెన్స్ సోదాలు.. వెలుగులోకి వచ్చేదెప్పుడు?

జిల్లాలోని పలు రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు జరిగిన నేపథ్యంలో సీఎంఆర్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. తనిఖీల్లో ఏం గుర్తించారు? ఎంత ధాన్యం నిల్వల్లో ఉంది? ఎంత మేరకు బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది? ఎంత బకాయి ఉంది? ఎక్కడైనా అక్రమాలు గుర్తించారా? గుర్తిస్తే బాధ్యులపై ఏ చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సోదాలు నిర్వహించడం ఒక ఎత్తయితే, వాటి ఆధారంగా అక్రమాలను నిర్ధారించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం మరో ఎత్తు. తనిఖీలతోనే వ్యవహారం ముగిస్తే ప్రజలకు సమాధానం దొరకదు. విచారణ నివేదికలు, నమోదైన కేసులు, బకాయిల వసూళ్లు, ప్రభుత్వానికి జరిగిన నష్టంపై అధికారిక వివరాలు బహిర్గతం చేయాలి.

అధికారుల పర్యవేక్షణ ఏమైంది?

ప్రభుత్వ ధాన్యం మిల్లులకు చేరే సమయంలోనే నిల్వల లెక్కలు, మిల్లింగ్ సామర్థ్యం, బియ్యం దిగుబడి, సరఫరా గడువులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. అలాంటప్పుడు భారీ వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి? తనిఖీలు క్రమం తప్పకుండా జరిగాయా? రికార్డుల్లో తేడాలు కనిపించినప్పుడు అధికారులు ఏం చేశారు? నిర్లక్ష్యం జరిగితే దానికి బాధ్యులెవరు?

ఈ ప్రశ్నలు ఇప్పుడు జిల్లా ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. అక్రమాలకు ఎవరైనా సహకరించినట్లు ఆధారాలు లభిస్తే, వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టాలి. అదే సమయంలో ఆరోపణలను ఆధారాలతో నిర్ధారించి, వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

ప్రజాప్రతినిధుల మౌనం.. సమాధానాలు చెప్పేదెవరు?

ప్రజాధనానికి సంబంధించిన ఇంతటి కీలక వ్యవహారంపై ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు, మిల్లుల వారీగా బకాయిలు, ప్రభుత్వానికి అప్పగించిన బియ్యం, పెండింగ్ పరిమాణం, తనిఖీల ఫలితాలు, రికవరీ వివరాలను బహిర్గతం చేయాలి. ప్రజలకు సమాధానం చెప్పకుండా మౌనం వహిస్తే అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

లెక్కలు తేల్చాల్సిందే.. బాధ్యులను శిక్షించాల్సిందే!

సీఎంఆర్ ధాన్యం వ్యవహారంపై జిల్లా స్థాయిలోనే కాకుండా అవసరమైతే ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలి. మిల్లుల వారీగా ధాన్యం కేటాయింపులు, నిల్వలు, మిల్లింగ్ వివరాలు, బియ్యం సరఫరా, బకాయిలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలి. ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు తేలితే బాధ్యుల నుంచి నష్టాన్ని రికవరీ చేయాలి. అక్రమాలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ ధాన్యం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. గద్వాల సీఎంఆర్ వ్యవహారంలో అనుమానాలకు తెరదించాలంటే మాటలు కాదు.. వాస్తవాలు కావాలి. హామీలు కాదు.. లెక్కలు కావాలి. తనిఖీలు మాత్రమే కాదు.. తుది నివేదికలు, బాధ్యులపై చర్యలు కావాలి.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కరుణాకర్ కోరారు.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలంలో 800 మందికి పైగా ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు కేవలం 628 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.మండలంలో 2 వేల వరకు పట్టభద్రుల ఓటర్లు ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు.ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును నవంబర్ 6 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హులైన పట్టభద్రులు చివరి రోజు వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారిక వెబ్‌సైట్‌లో ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు.దరఖాస్తుతో పాటు డిగ్రీ మెమో, పాస్‌పోర్టు సైజు ఫొటో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో నీటి కష్టాలు..

మొదటి పేజీ తరువాయి...

యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టల్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.నీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, అక్రమ బోర్ల నియంత్రణలో భాగంగా హైడ్రా అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. అయితే తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ట్యాంకర్ల యజమానులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ వివాదం కారణంగా నగరంలో నీటి సరఫరా వ్యవస్థపై మరింత ఒత్తిడి పెరిగింది. ఇదిలా ఉండగా.. నీటి దందా కారణంగా తమ ఇళ్లలోని బోర్లు ఎండిపోతున్నాయని పలు కాలనీల ప్రజలు హైడ్రాకు ఫిర్యాదులు చేస్తున్నారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయానికి వచ్చి కమిషనర్ ఏవీ రంగనాథ్ దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నారు. నివాస ప్రాంతాల్లోని బోర్ల కంటే వ్యాపార అవసరాల కోసం ఏర్పాటు చేస్తున్న కొన్ని బోర్లు చాలా లోతుగా ఉంటున్నాయని.. వాటి నుంచి భారీగా నీటిని తోడేస్తుండటంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గాజులరామారానికి చెందిన సుమారు 50 మంది ఇటీవల హైడ్రా కార్యాలయాన్ని సంప్రదించగా.. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అక్రమ బోర్లు ఉన్నట్లు గుర్తించిన ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నట్లు హైడ్రా వర్గాలు తెలిపాయి. ఫాక్స్ సాగర్ సమీపంలో 7 బోర్లను తొలగించినట్లు పేర్కొన్నాయి. సున్నం చెరువు, తమ్మిడికుంట ప్రాంతాల్లోనూ ఫిర్యాదుల ఆధారంగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించాయి.

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం

మొదటి పేజీ తరువాయి...

ఉన్నారని, యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తన చుట్టూ ఎప్పుడూ యాదవులు ఉంటారని, మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసుకొని సదర్ వేడుకకు హాజరయ్యానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నగరంలో శాంతి భద్రతలు కాపాడుతూ, అందరిని ఒక తాటిపై ఉంచామని స్పష్టం చేశారు.

ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవ్వాలి

సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయానికి పశుసంపద ఎంతో కీలకమని పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సదర్ ద్వారా యాదవ సంస్కృతి ప్రపంచానికి చాటడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో వారు భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు.

రిజర్వేషన్లు కల్పించాలి

యాదవ సమాజ ఐక్యత దేశవ్యాప్తంగా విస్తరించాలని బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆకాంక్షించారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు



రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో ఈ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకమని ఉ త్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

ధైర్యంగా ముందుకు సాగాలి

సదర్ పండుగ హైదరాబాద్ షాన్‌కు ప్రతీకగా నిలుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. యాదవులు సామాజికంగా, విద్యాపరంగా ఎదగాలని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సదర్ వేడుకలు సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. దీపావళి అంటే చెడుపై మంచి విజయం సాధించినట్లుగా ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

యాదవుల పాత్ర ఎంతో కీలకం

అంతరించిపోతున్న ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడమే సదర్ సమ్మేళనం ఉద్దేశమని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన తెలిపారు. సదర్ సమ్మేళనం యాదవుల ఐక్యతకు చిహ్నమని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహాభారతం నుంచి దేశ చరిత్ర వరకు యాదవుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ వేడుక ఇప్పుడు ఇతర ప్రాంతాలకు విస్తరించడం సంతోషకరమన్నారు. యాదవులంతా సంఘటితంగా ఉండి భవిష్యత్తు రాజకీయాలను ప్రభావితం చేయాలని పిలుపునిచ్చారు.

ట్విట్టర్ టిల్లు మీది మేనేజ్‌మెంట్ కోటా.. మాది మెరిట్ కోటా..!

మొదటి పేజీ తరువాయి...

ప్రయత్నిస్తే.. దాన్ని పట్టుకుని బౌన్సర్ అంటూ హేళన చేస్తారా అని ప్రశ్నించారు. “సొంత పార్టీ కార్యకర్తలపైనే బౌన్సర్లతో దాడులు చేయించిన దుర్మార్గపు సంస్కృతి బీఆర్ఎస్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు కార్యకర్తలను గాలికి వదిలేసిన చరిత్ర మీది” అంటూ కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.

మియాపూర్ భూముల అమ్మకంపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ఫైర్

రాష్ట్రంలోని విలువైన భూములను కారుచౌకగా అమ్మేసి దోచుకున్న ఘనత కేసీఆర్ కుటుంబానికే దక్కుతుందని బండి సంజయ్ ఆరోపించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అదే దారిలో నడుస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన 6 గ్యారెంటీలను పక్కనపెట్టి, మియాపూర్ భూములను తెగనమ్మి ఢిల్లీ అధిష్టానానికి కప్పం కట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోందని ధ్వజమెత్తారు.

కండక్టర్ ప్రవళిక మృతిపై దిగ్భ్రాంతి.. ఆర్టీసీ సిబ్బందిని ఇబ్బంది పెట్టొద్దు

ఇటీవల బస్సులో జరిగిన తోపులాట ఘటనలో ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక మృతి చెందడంపై బండి సంజయ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసౌకర్యాలపై ఉన్న కోపాన్ని ప్రయాణికులు ఆర్టీసీ కార్మికులపై చూపించవద్దని విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ తర్వాత సరైన పెన్షన్ కూడా లేకపోయినా, నిత్యం కోటి మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు సిబ్బంది ఎంతో ఓపికతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. క్లిష్ట పరిస్థితుల్లో శ్రమిస్తున్న ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రజలు మానవతా దృక్పథంతో మెలగాలని ఆయన కోరారు.

తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిచి తీరుతాం

మొదటి పేజీ తరువాయి...

అయిన మోదీ.. ఆయన అడుగుజాడల్లో పని చేయడం లేదు. స్వాతంత్ర్య ఉద్యమంలోనే మహాత్మాగాంధీ.. రఘుపతి రాఘవ రాజారాం అని రాముడి భజన చేశారు. అప్పటికీ బీజేపీ పుట్టలేదు.. మోదీ, అమిత్ షాలు కూడా పుట్టి ఉండరు అని జగ్గారెడ్డి తెలిపారు.రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే అవకాశం లేదని అమిత్ షా మాట్లాడారు. అమిత్ షా ఒక విషయం మర్చిపోతున్నారు. అమిత్ షా మీరు అధికారంలోకి రాకముందు ఏం జరిగిందో మీ కుటుంబ సభ్యులని అడిగి తెలుసుకోండి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలు నేరుగా నెహ్రూని ప్రధానిగా ఎన్నుకున్నారు అని గుర్తు చేశారు. 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పడింది. సోనియా, రాహుల్ గాంధీని ప్రధాని కావాలని ఎంపీలు అందరు తీర్మానం చేశారు. కానీ మాకు ప్రధాన మంత్రి పదవి వద్దన్నారు. మన్మోహన్ సింగ్‌ని ప్రైమ్ మినిస్టర్ చేశారు. మన్మోహన్ సింగ్ సైతం ప్రైమ్ మిస్టర్ అయ్యాక రాహుల్ గాంధీ దగ్గరికి వెళ్ళి మీరు ప్రధానమంత్రి కావాలని కోరారు. కానీ రాహుల్ గాంధీ తిరస్కరించి మీరే ఉండాలి.. మీ నేతృత్వం లోనే పని చేస్తామని అన్నారని జగ్గారెడ్డి తెలిపారు.

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై విజిలెన్స్ విచారణకు కేరళం అనుమతి

మొదటి పేజీ తరువాయి...

చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు. జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.

నేడు తెలంగాణ కేబినెట్ భేటీ.. కీలక నిర్ణయాలపై ఉత్కంఠ

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అందిన అజెండా ప్రతులు, చర్చించాల్సిన అంశాలు, ప్రతిపాదిత బిల్లులను పరిశీలించారు. కేబినెట్ ముందుకు తీసుకురావాల్సిన ప్రతిపాదనలపై అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, బడ్జెట్ కేటాయింపులపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరుపైనా సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రాజెక్టులకు భూ కేటాయింపులు, కొత్త పరిశ్రమలకు అనుమతుల వంటి ప్రతిపాదనలు కూడా కేబినెట్ అజెండాలో ఉండే అవకాశం ఉంది.

తాళం వేసిన ఇండ్లలో దొంగతనాలకు

పాల్పడుతున్న పాత నేరస్థుడు అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగలు

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం)

తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగ తనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్థున్ని మైలార్దేవుపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని నుంచి 38 తులాల బంగారం, 70 తులాల వెండి ని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై గతంలో 120 కేసులు ఉన్నాయి. ప్రసు తం 11 కేసులు బుక్ అయ్యాయి.. నేరస్థుడు గతంలో రెండు సార్లు పీడీ యాక్టు క్రింద జైలుకు వెళ్లి వచ్చాడు. వివరాలను మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాం ద్రాయణగుట్ట ఏసీపీ సుదాకర్, మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ శ్రీనివాస్, డీఎస్ఐ వేణుగోపాల్ లతో కలసి రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ వెల్లడించారు. 2026 అక్టోబరు 19వ తేదీన దసరా పండుగ కు ఒక రోజు ముందు లక్ష్మీగూడ కు చెందిన ఎం శ్రావణ్ కుమార్ ఉదయం 11 గంటలకు తన ఇంటికి తాళం వేసి భార్యతో కలసి కిరాణా షాప్ కు వెళ్లారు. మద్యాహ్నం ఇంటికి వచ్చారు. ఇంటి తాళం విరగ్గొట్టి ఉం డటం, బీరువా తెరిచి ఇంట్లో దాచిన 15 తులాల బంగారం, 40 తులాల వెండి, కొంత నగదు ను దొం గలు ఎత్తుకెళ్లడం గమనించారు. అదే రోజు మైలార్దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా నిందితుని ముఖ కవలికలను గుర్తు పట్టి విచారణ చేయగా సాయిబాబానగర్ లో పండ్లు విక్రయించే సయ్యద్ హమీద్ (48) అని తెలుసుకున్నారు.అతని నివాసం మహారాష్ట్ర అని, కొన్ని రోజులు ఈసీఐఎల్ దమ్మాయిగూడ లో కూడా నివాసం ఉన్నాడని గుర్తించారు. అతని కోసం గాలిస్తుండగా బుధవారం లక్ష్మీగూడ వాంబే కాలనీ చౌరస్తా దగ్గర డీఎస్ఐ వేణుగోపాల్ వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యాహ్నం 3 గంటల సమయంలో ఒక యాక్టీవా ద్విచక్ర వాహనదారుడు పోలీసులను చూసి పారిపోసాగాడు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి విచారించగా, తాను పాత నేరస్థున్ని అని ఒప్పుకుని అక్టోబరు 19న లక్ష్మీగూడ లో దొంగతనం చేసిందని తానే అని ఒప్పుకున్నాడు. ఆ తర్వాత మరో పది చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణ లో ఒప్పుకున్నాడు.

సయ్యద్ హమీద్ పాత నేరస్థుడు :

లక్ష్మీగూడ లో పట్టుబడ్డ సయ్యద్ హమీద్ పాత నేరస్తుడని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గతంలో అతను హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలలో 120కి పైగా దొంగతనాలకు పాల్పడ్డాడని విచారణ లో తేలిందన్నారు. నాచారం, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ ల నుంచి ఆయనపై రెండు సార్లు పీడీ యాక్టులు కూడా నమోదై జైలు కెళ్లి వచ్చాడన్నారు. అతని వద్ద 38 తులాల బంగారం, 70 తులాల వెండిని, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతని రిమాండ్ కు తరలిం చడం జరిగిందన్నారు.

ఘనంగా ప్రిస్కిల్లా శాంతి-సమూయేల్ వెస్లీల వివాహ వేడుక

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం)

రాజేంద్రనగర్ నియోజకవర్గం బాబుల్ రెడ్డి నగర్ వాస్తవ్యులు పాస్టర్ దాసరి ఆనంద్ పాల్ – దాసరి జయ పాల్ ల కుమార్తె ప్రిస్కిల్లా శాంతి వివాహం బి సుందర్ రాజ్ – స్వర్ణ లత ల కుమారుడు సమూయేల్ వెస్లీ తో బుధవారం ఘనంగా జరిగింది. సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద గల మిల్లె లీనియం మెథడిస్ట్ చర్చ్ లో జరిగిన వివాహం లో దైవ జనులు రెవరెండ్ కె సుందర్ పాల్, రెవరెండ్ ఆర్ సమూయేల్, రెవరెండ్ ఈ లక్ష్మణ్, రెవరెండ్ ఎన్ పి పాల్ లు పాల్గొని వివాహం జరిపించారు. ఈ సందర్భంగా అత్తాపూర్ రాక్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ కె సుందర్ పాల్ బైబిల్ సందేశాలను అందచేశారు. వివాహం అనంతరం కేక్ కట్ చేశారు. వివాహ వేడుక లో సీనియర్ పాస్టర్ రెవరెండ్ థామస్ కురియన్, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, ఉపాధ్యక్షులు పాస్టర్ ప్రమోద్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్ లతో పాటు రెవరెండ్ ఎన్ రాజారాం, పాస్టర్ మంగలారం ప్రేమ్ కుమార్, పాస్టర్ క్రిస్టాపర్, పాస్టర్ కృష్ణ పాల్, పాస్టర్ పాల్ దేవరాజ్, పాస్టర్ సీ హెచ్ దినకర్ , పాస్టర్ జాన్ వెస్లీ, పాస్టర్ జే పీ పాల్, పాస్టరమ్మల ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ స్వర్ణ రాజారాం, ఉపాధ్యక్షురాలు బిషప్ డాక్టర్ ఎస్ యేసు మణి, పాస్టర్ స్పందన పాల్, పాస్టర్ సీహెచ్ లీనా కుమారి, పాస్టర్ కవితా పాల్, పాస్టర్ సునీతా పాల్, పాస్టర్ గ్లోరి, పాస్టర్ లిల్లీ గ్రేస్, బ్రదర్ డానియల్ భీమయ్య, సిస్టర్ ఎ మాధవి తదితరులు పాల్గొన్నారు.



ప్రిస్కిల్లా శాంతి – సమూయేల్ వెస్లీ వివాహ వేడుక లో పాల్గొని వధూ వరుల కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ పాస్టర్స్

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

సైబర్ మోసాలకు గురైతే వెంటనే స్పందించండి... ఆలస్యం చేయవద్దు... అప్రమత్తంగా ఉండండి.

ప్రతి నెల మొదటి బుధవారం "సైబర్ జాగ్రత్త దివాస్

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

గద్వాల, నవంబర్ 4: సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సూచించారు. సైబర్ నేరాల నివారణలో భాగంగా ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే 'సైబర్ జాగ్రత్త దివాస్'లో భాగంగా బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ కె. శంకర్‌తో కలిసి అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తెలియని లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, ఆకర్షణీయమైన ఆఫర్లు, మోసపూరిత ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులు, యూపీఐ ప్రతినిధులమని చెప్పి ఫోన్ చేసినా వెంటనే నమ్మవద్దని, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో వెబ్‌సైట్ చిరునామాను పరిశీలించిన తర్వాతే కొనుగోళ్లు చేయాలని, పబ్లిక్ వై-ఫై ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించవద్దని సూచించారు.



అవసరం లేని యాప్‌లకు కెమెరా, మైక్రోఫోన్, కాంటాక్ట్స్ అనుమతులు ఇవ్వకూడదన్నారు. యూపీఐ ద్వారా డబ్బు స్వీకరించడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఎస్సైలు పాల్గొన్నారు.



యువత భవిష్యత్తుతో

చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవు:

ఎస్పై శ్రీనివాసులు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

గద్వాల పట్టణంలోని భీంనగర్ లో పలు టీ షాపులను గద్వాల టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు అకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా టీ స్టాల్స్ లో వినియోగదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీస్టాల్స్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినస్మోకింగ్ జోన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.యువత చెడు మార్గాలకు దారి తీసే విధంగా సిగరెట్లు పీలుస్తున్నారని తద్వారా యువత ఆరోగ్యం చెడిపోతుందని మత్తుకు బానిసలై చెడు మార్గాలకు దారి తీసే విధంగా ఉన్నటువంటి స్మోకింగ్ రూమ్ లను ఎత్తివేయాలని ఆదేశించారు.ఇక నుండి తరచూ దాడులు నిర్వహిస్తామని ఎట్టి పరిస్థితుల్లో సపరేట్ గదులు ఏర్పాటు చేసి సిగరెట్లు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం టీ స్టాల్స్ లో మొబైల్ లో బిజీ బీజీగా ఉన్న యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు.యువత చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలే తప్ప ఎలాంటి ఆన్ లైన్ గేమ్స్, సిగరెట్, మత్తు పదార్థాలు ఇతర వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు.

పాగుంట శ్రీవెంకన్న బ్రహ్మోత్సవాలకు

కలెక్టర్ ఆహ్వానించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

ఈనెల 7నుంచి 11 వరకు జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆలయ ఈఓ పురేందర్ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ఈ మేరకు బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆలయ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. భక్తులకు తాగునీటి ఎద్దడి రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మురళి తిమ్మారెడ్డి, ఎర్రభీంరెడ్డి, పద్మారెడ్డి, శీను, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో క్రైస్తవ మహిళలపై

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

అర్చ్ బిషప్ డాక్టర్ ప్రియనాథ్

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం)

అల్మాస్ గూడ లో క్రైస్తవ మహిళ లపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్లాంట్ మినిస్ట్రీస్ ఆర్చ్ బిషప్ డాక్టర్ ప్రియనాద్ అన్నారు. ప్లాంట్ మినిస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి, రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన డాక్టర్ ఎస్ యేసుమణి, బిషప్ అనిల్ చాబ్రిలు విడుదల చేసిన ప్రకటన లో అల్మాస్ గూడ సంఘటన ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అల్మాస్ గూడ లో తమకు తెలిసిన వారి ఇంటికి వెళ్లి వస్తున్న ఇద్దరు క్రైస్తవ మహిళల పట్ల కొందరు అమానుషంగా ప్రవర్తి ంచడం, అందులో ఒక వ్యక్తి మహిళలని కూడా చూడకుండ దాడి చేయడం మహిళా హక్కులను కాలరాయడమేనన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ పోలీసు యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయాలన్నారు.

మహిళలని కూడా చూడకుండ క్రూరంగా ప్రవర్తించిన వ్యకిని అరెస్ట్ చేయాలి :

మహిళలని కూడా చూడకుండ ఇష్టానుసారంగా దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ కె సుందర్ పాల్, అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రణీత్ బాబు, కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్ లు కోరారు. ఎవరికి ఇబ్బంది కలుగకుండ తమకు తెలిసిన వారి ఇంటికి వెళ్లి వస్తున్న మహిళలను పట్టుకుని చితకబాదడం ఎంత వరకు సమంజనమన్నారు. ఈ సంఘటన పై దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

నియమాలే ప్రాణరక్షణ కవచాలు





జాయ్ స్కూల్‌లో విద్యార్థులకు ఘనంగా ట్రాఫిక్ అవగాహన సదస్సు

సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో శిక్షణ

రహదారి భద్రతపై అవగాహన పెంచుకున్న విద్యార్థులు

పటాన్ చెరు,నవంబర్ 4(ప్రభాత ఉదయం):

నేటి బాలలే రేపటి బాధ్యతాయుత పౌరులని, వారిలో చిన్నతనం నుంచే రహదారి భద్రతపై స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జాయ్ స్కూల్ యాజమాన్యం స్పష్టం చేసింది. విద్యార్థుల్లో నిత్య జీవిత నైపుణ్యాలను పెంపొందించే క్రమంలో భాగంగా, పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఈ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ నిపుణులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రత్యక్ష వీడియో దృశ్యాల ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే తీరును, వాటి తీవ్రతను కళ్లకు కట్టారు. నిత్యం పెరుగుతున్న ప్రమాదాలు, ప్రాణనష్టం, తీవ్ర గాయాలకు గల కారణాలను వివరిస్తూ విద్యార్థులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉల్లంఘించడం వల్ల ఎదురయ్యే ప్రాణాంతక పరిస్థితులపై వివరించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జీబ్రా క్రాసింగ్ వినియోగం, హెల్మెట్–సీట్‌బెల్ట్ ప్రాముఖ్యత, సురక్షిత ప్రయాణ సూత్రాలను ఆచరణాత్మకంగా నేర్పించారు. ఈ వివరాలన్నీ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా, వారిలో సామాజిక బాధ్యతను రేకెత్తించాయి. సదస్సు ముగింపులో, విలువైన సమాచారాన్ని అందించిన సైబరాబాద్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, బృంద సభ్యులు మల్లేశ్వర్, నవీన్, శివకుమర్లను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల విజ్ఞానాన్ని అందించడమే కాకుండా, వాస్తవ జీవిత పరిస్థితులను ఎదుర్కొనే వివేకాన్ని, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అందించడమే నిజమైన విద్య. రోడ్డుపై క్రమశిక్షణ పాటించడం ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పుపై గద్వాలలో విద్యార్థుల అవగాహన ర్యాలీ



జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గద్వాలలోని బెటర్ లైఫ్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం గద్వాల పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మారుతున్న వర్షపాత సరళి, భవిష్యత్తులో నీటి కొరత ముప్పులపై ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని నినాదాలు చేశారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులు చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సంజీవ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే పనులను ఎలాంటి తగాదాలకు ఆస్కారం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు.మల్దకల్ మండలంలోని బూడిదపాడు గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ మధుమోహన్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణ తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించి, పనుల అమలులో ఎదురవుతున్న అంశాలపై అధికారులతో చర్చించారు. పునఃసర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రీ సర్వేతో భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్వేకు లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఈ పర్యటనలో సర్వే ఏడి నూకరాజు, మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం

రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతం

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమష్టి పోరాటానికి నేతల పిలుపు





పటాన్ చెరు, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని ముప్పై మూడు జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. సమావేశంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాట్ అలీ, జాతీయ నాయకుడు దేవులపల్లి అమర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణపై విస్తృతంగా చర్చించారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సమష్టిగా పోరాడాలని, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి, విరాట్ అలీలను సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ రుమాండ్ల శాలువా, పూలగుచ్ఛంతో సత్కరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంఘం చేపట్టే అన్ని కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని అనిల్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.




కమిషనర్ కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

కమిషనర్‌కు డివిజన్ సమస్యలపై వినతి పత్రం అందజేత

పటాన్ చెరు, నవంబర్ 4 (ప్రభాత ఉదయం):

అమీన్‌పూర్ పురపాలక సంఘం నూతన ఇన్‌ఛార్జ్ కమిషనర్ లలితను భారతీయ జనతా పార్టీ బొల్లారం శాఖ అధ్యక్షుడు కోత్వాల్ కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి కలిసి సత్కరించారు. అనంతరం 272వ వార్డు పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఐటీసీ సంస్థ నుండి గాంధీ విగ్రహం వరకు, అలాగే ఆలయ రక్షక భట నిలయం మార్గంలో వీధిదీపాలు లేక రాత్రివేళల్లో మహిళలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయం నుండి గాంధీ విగ్రహం వరకు గల ప్రధాన రహదారిలో మురుగునీటి పారుదల సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్థానికంగా నివసిస్తున్న సుమారు ఐదు వేల మంది బీహార్, ఉత్తరప్రదేశ్ కార్మికుల ఛత్ పూజ కోసం తాగునీరు, విద్యుద్దీపాలు, ధ్వనివర్ధకాల ఏర్పాట్లను ఈ నెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కమిషనర్, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి

బిజెపి జిల్లా యువ నాయకురాలు డి.కె.స్నిగ్ధా రెడ్డి

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):

అర్హులైన పట్టభద్రులందరినీ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేయించేందుకు బిజెపి శ్రేణులు క్షేత్రస్థాయిలో బాధ్యతగా కృషి చేయాలని బిజెపి జిల్లా యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారంధరూర్ మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తిమ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించి, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలి అని సూచించారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు, జిల్లా బిజెపిఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, సర్పంచ్ రాజేష్ అయ్యా, మండల ఎమ్మెల్సీ ఇన్చార్జ్ నర్సన్ దొడ్డి కృష్ణా రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రామి రెడ్డి, శేఖర్ రెడ్డి, కెటిదొడ్డి మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి, కౌన్సిలర్ చంద్రశేఖర్, శాలన్న, ధరూర్ మండల నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ రెండో విడత ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలోని సంబంధిత గ్రామాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలి

అయిజ,అలంపూర్,ఉండవెల్లి,రాజోలి నాలుగు మండలాల పరిధిలో మద్యం దుకాణాలు మూసివేయాలి

నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిషేధం

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం):



ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లాలోని 19 గ్రామాల్లో మద్యం దుకాణాలు,2బి బార్లు,కల్లు దుకాణాలు మూసివేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20(1) ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు.అయిజ మండలంలోని పులికల్,వెనిసోంపురం, రాజాపురం,కేశవరం, కుతకనూరు గ్రామాలకు,అలంపూర్ మండలంలోని జిల్లెలపాడు, సుల్తాన్‌పురం,రాయలంపాడు, సింగవరం,కాశీపురం గ్రామాలకు వర్తిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఉండవెల్లి మండలంలోని బస్వాపురం,పుల్లూరు ,కల్గొట్ల, మెన్నిపాడు గ్రామాలు,రాజోలి మండలంలోని తుమ్మిళ్ల,ధన్వాడ, రాజోలి,పెద్దధన్వాడ, చిన్నధన్వాడ గ్రామాల పరిధిలో కూడా ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.సంబంధిత గ్రామాల్లోని మద్యం దుకాణాలు,బార్లు,కల్లు దుకాణాల నిర్వాహకులు నిర్దేశిత సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు,వ్యాపారులు జిల్లా యంత్రాంగం జారీ చేసిన ఉత్తర్వులకు సహకరించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608